ప్రజాశక్తి

బుధవారం 2 ఏప్రిల్ 2025

ముగిసిన పదో తరగతి పరీక్షలు

సోషల్ పరీక్షకు 99.62శాతం మంది హాజరు

ప్రజాశకి-విజయనగరం టౌన్

పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మంగళవారంతో ముగిసాయి. ఆఖరి రోజు జరిగిన సోషల్ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 22,862 మంది హాజరు కావాల్సి ఉండగా వారిలో 22,774 మంది హాజరయ్యారు. 88 మంది గైర్హాజరయ్యారు. ప్రైవేటు విద్యార్థులు 116 మందికి 71 మంది హాజరుకాగా, 45 మంది గైర్హాజరయ్యారు. ఎటువంటి సమస్యలూ లేకుండా పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని డిఇఒ యు.మాణిక్యం నాయుడు తెలిపారు.

టిడిపికి చైర్మన్..వైసిపి అసమ్మతికి వైస్ చైర్మన్

- ఇరువురి మధ్య ఒప్పందం
- వేడెక్కుతున్న రాజకీయాలు
- నేడు అవిశ్వాస తీర్మానం లేఖను కలెక్టర్‌కు ఇవ్వనున్న టిడిపి

ప్రజాశక్తి-బొబ్బిలి

అవిశ్వాస తీర్మానం నేపథ్యంలో బొబ్బిలిలో రాజకీయాలు వేడెక్కుతున్నాయి. మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ పై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు వైసిపి అసమ్మతి కౌన్సిలర్లు, టిడిపి కౌన్సిలర్లు సిద్ధం కావడంతో పట్టణంలో ఎక్కడ చూసినా రాజకీయ చర్చ వినిపిస్తుంది. అవిశ్వాస తీర్మానం పెట్టిన తర్వాత ప్రస్తుతం ఉన్న చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణను చైర్మన్ పదవి నుంచి తొలగించి ఆ పదవిని టిడిపికి అప్పగించేందుకు, వైస్ చైర్మన్ జి.రమాదేవిపై అవిశ్వాస తీర్మానం పెట్టి ఆ పదవి నుంచి దించేసి వైస్ చైర్మన్ పదవిని టిడిపికి మద్దతు ఇస్తున్న 10మంది అసమ్మతి కౌన్సిలర్లలో ఒకరికి ఇచ్చేందుకు అంగీకారం కుదిరినట్లు సమాచారం.

చైర్మన్ పదవి రేసులో ఇద్దరు

మున్సిపల్ చైర్మన్ పదవి రేసులో టిడిపి నుంచి టిడిపి పట్టణ అధ్యక్షుడు, 8వ వార్డు కౌన్సిలర్ రాంబార్కి శరత్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గా వ్యవహరిస్తున్న ఆరో వార్డు కౌన్సిలర్ గెంబలి శ్రీనివాసరావు చైర్మన్ పదవి రేసులో ఉన్నారు. ప్రస్తుతం మున్సిపల్ చైర్మన్‌గా కాపు సామాజిక వర్గానికి చెందిన సావు వెంకట మురళీ కృష్ణ ఉన్నారు. అవిశ్వాస తీర్మానంతో చైర్మన్ పదవిని కాపు సామాజిక వర్గం కోల్పోవడంతో అదే సామాజిక వర్గానికి చెందిన కౌన్సిలర్‌కు చైర్మన్ పదవి అప్పగించాలని వాదన గట్టిగా వినిపిస్తుంది. గత మున్సిపల్ ఎన్నికల్లో టిడిపి చైర్మన్ అభ్యర్థిగా గెంబలి శ్రీనివాసరావును రాజులు ప్రకటించి ఎన్నికలకు వెళ్లడంతో ఆ ఎన్నికల ఖర్చు కూడా గెంబలి శ్రీనివాసరావు పెట్టారు. టిడిపికి మెజారిటీ రాకపోవడంతో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గా గెంబలి శ్రీనివాసరావు కొనసాగుతున్నారు. ఇప్పుడు టిడిపికి చైర్మన్ పదవి దక్కితే గెంబలి శ్రీనివాసరావుకు ఇవ్వాలని ఆ పార్టీలో కొంతమంది కోరుతున్నట్లు సమాచారం. కావు సామాజిక వర్గానికి ఇవ్వాలి అనుకుంటే శరత్ కు, గతంలో ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలి అనుకుంటే గెంబలి శ్రీనుకు చైర్మన్ పదవి ఇచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి.

వైస్ చైర్మన్ పదవికి పోటీ

మున్సిపల్ వైస్ చైర్మన్ పదవికి పోటీ నెలకొంది. ప్రస్తుతం ఉన్న వైస్ చైర్మన్ జి.రమాదేవిపై అవిశ్వాస తీర్మానం పెట్టి వైస్ చైర్మన్ పదవి తమకు ఇవ్వాలని టిడిపికి మద్దతు ఇస్తున్న వైసిపి అసమ్మతి కౌన్సిలర్లు కోరగా కొప్పల వెలమ సామాజిక వర్గానికి ఇవ్వాలని టిడిపిలో ఉన్న కొప్పల వెలమ కౌన్సిలర్ కె.లక్ష్మి భర్త సత్యనారాయణ కోరుతున్నట్లు చర్చ జరుగుతుంది. బొబ్బిలి నియోజకవర్గం లోని, మున్సి పాలిటీలో కొప్పల వెలమ సామాజిక వర్గం బలంగా ఉంది. ఈనేపథ్యంలోనే వైస్ చైర్మన్ పదవి ఇవ్వాలని పలు ప్రాంతాలకు చెందిన కొప్పల వెలమ నాయకులు ఎమ్మెల్యే బేబినాయనను కోరినట్లు తెలిసింది.

నేడు అవిశ్వాస తీర్మానం కలెక్టర్‌కు ఇవ్వనున్న టిడిపి

మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం లేఖను జిల్లా కలెక్టర్ అంబేద్కర్‌కు టిడిపి కౌన్సిలర్లు బుధవారం ఇవ్వనున్నారు. 10మంది వైసిపి అసమ్మతి కౌన్సిలర్లు, 10మంది టిడిపి కౌన్సిలర్లు సంతకాలతో ఉన్న అవిశ్వాస తీర్మానాన్ని కలెక్టర్‌కు అందజేయనున్నారు. వైసిపి కౌన్సిలర్లు క్యాంపులో ఉండడంతో ఆయా సంతకాలు వైసిపి కౌన్సిలర్లు చేసినవా కాదా అని నిర్ధారణ చేసుకుని అవిశ్వాస తీర్మానంపై ప్రత్యేక కౌన్సిల్ సమావేశానికి సమయం ఖరారు చేయనున్నట్లు తెలుస్తోంది.

ఎస్‌పి శైలజ, సుధాకర్ దంపతులకు పురస్కారం

ఎస్‌పి శైలజ, సుధాకర్ దంపతులను సన్మానిస్తున్న గురునారాయణ కళాపీఠం సభ్యులు

ప్రజాశక్తి-విజయనగరం ప్రతినిధి

శ్రీగురు నారాయణ కళా పీఠం వార్షికోత్సవం సందర్భంగా సినీ నేపథ్య గాయని ఎస్‌పి శైలజ, సినీనటుడు శుభలేఖ సుధాకర్ దంపతులకు జీవితసాఫల్య పురస్కారాన్ని అందజేసింది. కళాపీఠం 4వ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం రాత్రి ఆనందగజపతి ఆడిటోరియంలో కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షులు బి.ఎ. నారాయణ ఆధ్వర్యాన ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా స్వర సాగర సంగమం పేరిట సాయంత్రం నాలుగు గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు నిర్విరామంగా పీఠం సభ్యులు, వివిధ ప్రాంతాల నుంచి గాయినీ, గాయకులు సినీసంగీత విభావరి అలరించింది. కార్యక్రమంలో భాగంగా శైలజ, సుధాకర్ దంపతులకు విజయనగర ఎంఎల్ఏ పూసపాటి ఆదితి గజపతి రాజు తదితరులు పురస్కారం అందజేశారు. ఈ సందర్భంగా సినీ నిర్మాత, దర్శకుడు ఇ. రామారావు మట్లాడుతూ సంగీతం, పాటలు విజయ నగరం లోనే పుట్టాయని అన్నారు. ఘంటసాల, సుశీల గాత్ర ప్రస్థానం ఇక్కడినుంచే మొదలైందన్నారు. ఒక కళాక్షేత్రాన్ని ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేకి విజ్ఞప్తి చేశారు. కళా పీఠం నిర్వహకులు బిఎ నారాయణ మాట్లాడుతూ పురస్కార గ్రహీతలు శైలజ, సుధాకర్ సినీ రంగంలో అందించిన సేవలను కొనియాడారు. పురస్కార గ్రహీతలకు మాట్లాడుతూ విజయనగరం కళలకు పుట్టినిళ్ళు వంటిది అని కొనియాడారు. ఇటువంటి నేలపై పురస్కారం అందుకోవడం గర్వంగా భావిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కళా పీఠానికి చెందిన బాలగాయకులు విష్ణు ప్రియ, బి.లావణ్యలతిక, బి.విధుశేఖర్ చరిత్ర, డి.సోనాలి తో పాటు హారికా శివరాం, సురభి శ్రావణి, డాక్టర్ జి.సన్యాసమ్మ, పవన్ చర్, సంతోష్ చరణ్ తోపాటు కళాపీఠం కళాకారులు గురు నారాయణ కళా పీఠం సంగీత సేవకై వెలసిన గురుపీఠం పాటతో అలరించారు. అంతకుముందు శైలజ, సుధాకర్ దంపతులు పైడితల్లి అమ్మవారిని దర్శించుకున్నారు. గాన కోకిల పి.సుశీలను సోమవారం రాత్రి కళాపీఠం సభ్యులు సన్మానించారు.

వర్ధమాన గాయకులను అభినందిస్తున్న గాన కోకిల పి.సుశీల

ఇంటి గోడకు స్టిక్కరు అతికిస్తున్న సిపిఎం నాయకులు

మా ఇంటికి స్మార్ట్ మీటరు వద్దు

సిపిఎం ఆధ్వర్యంలో ఇంటింటికీ స్టిక్కర్లు అతికింపు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

తమ ఇళ్లకు స్మార్ట్ మీటర్లు పెట్టొద్దు అంటూ సిపిఎం ఆధ్వర్యాన పలువురు తమ ఇళ్లకు స్టిక్కర్లు అతికించారు. మంగళవారం 46 వ డివిజన్ ఎల్‌బిజి నగర్‌లో విద్యుత్ సర్దుబాటు, ట్రూఅప్ ఛార్జీలను, అదానీతో చేసుకున్న సెకీ విద్యుత్ ఒప్పందాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గోడ పత్రికను విడుదల చేశారు అనంతరం జరిగిన సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రెడ్డి శంకరరావు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు మాకొద్దూ అంటూ ప్రతి ఒక్కరూ నినదించాలని పిలుపునిచ్చారు. నేటి నుంచి ఇంటింటికీ వెళ్లి స్మార్టు తమకొద్దు అంటూ పోస్టర్, స్టిక్కరు అతికించే కార్యక్రమం చేపడతామన్నారు. టిడిపి అధికారంలోకి రాగానే అదానీ స్మార్ట్ మీటర్లు రద్దు చేస్తామని. ఇంటికి స్మార్ట్ మీటరు పెడితే తొలగిస్థామని మంత్రి లోకేష్ గతంలో చెప్పారని, తీరా అధికారంలోకి వచ్చాక ఇళ్లకు స్మార్టు మీటర్లు ఎందుకు పెడుతున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. తక్షణమే స్మార్టు మీటర్లు, సెకీ ఒప్పందాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు పి.రమణమ్మ, బి.రమణ, స్థానిక నాయకులు రాజు, కె.రమణ, అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.

అపరాల నాణ్యత పరిశీలన

ప్రజాశక్తి-జామి

మార్క్ ఫెడ్ జిల్లా మేనేజర్ ఎన్.వెంకటేశ్వరరావు విజినిగిరి గ్రామంలో మంగళవారం రైతుల ఇళ్లకు వెళ్లి వారు పండించిన మినుముల నాణ్యతను పరిశీలించారు. ఎవరైనా అపరాలు మద్దతు ధర పొందవలసిన రైతులు ఉంటే తక్షణమే గ్రామంలోని రైతు సేవా కేంద్రానికి వెళ్లి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. ఈ విషయాన్ని రైతులందరికీ తెలియజేశారు. గంట్యాడ, గజపతినగరం, బొబ్బిలి, సంతకవిటి మండలాలలో కూడా అపరాలు ప్రొక్యూర్మెంట్ సెంటర్లను ప్రారంభించామని, రైతులంతా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

గ్రామాల్లో మౌలిక వసతులకు నిధులు

పింఛన్ల పంపిణీలో మంత్రి కొండపల్లి

ఎం.కొత్తవలసలో పింఛను అందజేస్తున్న రాష్ట్రమంత్రి కొండపల్లి శ్రీనివాస్

ప్రజాశక్తి-బొండపల్లి

రాష్ట్రంలో పట్టణాలతో సమానంగా గ్రామీణ ప్రాంతాల్లోనూ మౌలిక వసతులు కల్పిస్తామని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, సెర్ప్ శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు చెప్పారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక గత పదినెలల కాలంలో గ్రామాల్లో సిమెంటు రోడ్లు, డ్రెయిన్లు, ఇతర వసతులను కల్పించేందుకు పెద్ద ఎత్తున నిధులను ఖర్చు చేశామన్నారు. గత పదినెలల కాలంలో బొండపల్లి మండలం ఎం.కొత్తవలస గ్రామంలోనే రూ.1.10 కోట్లతో సిసి రోడ్లు, కాల్వల నిర్మాణం పూర్తిచేశామని, మరో రూ.30 లక్షల పనులు జరుగుతున్నాయని చెప్పారు. మండలంలోని మరువాడ కొత్తవలస గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పథకం కింద వృద్ధులు, వితంతువులు, విభిన్న ప్రతిభావంతులకు సామాజిక ఫించను పంపిణీ కార్యక్రమంలో మంగళవారం మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు వృద్ధులు, వితంతువులు, విభిన్నప్రతిభావంతుల ఇళ్లకు వెళ్లి వారి యోగక్షేమాలు తెలుసుకొని వారికి ప్రభుత్వం తరపున ఫించను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ అసహాయులైన వారికి చేయూత అందించాలనే సదుద్దేశ్యంతో రాష్ట్రంలో ఫించన్ల కోసం ఏటా రూ.33,000 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం ఖర్చుచేస్తోందని చెప్పారు. ఎం.కొత్తవలస గ్రామంలోనే 420 మందికి ప్రతినెలా ఫించను అందజేస్తున్నామని పేర్కొన్నారు. సందర్భంగా గ్రామస్థుల సమస్యలను మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలుసుకొని వారి నుంచి వినతులు స్వీకరించారు. గ్రామంలో ఇంటింటి కొళాయిల ఏర్పాటు త్వరగా పూర్తిచేయాలని గ్రామస్తులు కోరగా వచ్చే రెండు మూడు నెలల్లో పూర్తిచేసేలా చర్యలు చేపడతామన్నారు. రెవిన్యూ సంబంధ సమస్యలపై పలువురు వినతులు అందజేయగా సమస్య పరిష్కారం కోసం తెలిపేందుకు సంబంధిత విఆర్ఒ అందుబాటులో లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. పలువురు అగ్రిగోల్డ్ పరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరక్టర్ కళ్యాణ చక్రవర్తి, ఎంపిడిఒ గిరిబాల, గ్రామ సర్పంచ్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పింఛన్లు పంపిణీ

విజయనగరం టౌన్ : నగరంలో మంగళవారం ఎన్‌టిఆర్ భరోసా పథకం కింద లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ మంగళవారం జరిగింది. 13,14 డివిజన్లలో స్థానిక ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు, రాష్ట్ర కాపు కార్పొరేషన్ అధ్యక్షురాలు పాలవలస యశస్విని పాల్గొని వృద్ధులకు పింఛన్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు మీడియాతో మాట్లాడుతూ ఎన్టీఆర్ భరోసా పథకం ద్వారా పింఛన్లు అందించడం వల్ల వృద్ధులకు, వికలాంగులకు, వితంతువులకు ఎంతోమేలు చేకూరుతుందని అన్నారు. కార్యక్రమంలో విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య తదితరులు పాల్గొన్నారు.

పింఛను అందజేస్తున్న ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి

తాండ్రంగిలో ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్

పంచ ప్రాధాన్యాల మేరకు ఉపాధి పనులు

కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

ప్రజాశక్తి-జామి

జిల్లాలో ఉపాధిహామీ పథకం కింద ఈ సీజనులో చేపట్టే పనులకు పంచ ప్రాధాన్యతలను నిర్దేశించామని కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ వెల్లడించారు. వచ్చే మూడు నెలల కాలంలో ఈ ప్రకారం గ్రామాల్లో పనులు చేపట్టేందుకు ఆదేశాలు జారీ చేశామన్నారు. పశువులకు నీటితొట్టెలను నిర్మించడం, సేద్యపు నీటికుంటలు నిర్మాణం, పంట కాలువల పునరుద్ధరణ, చెరువు కుంటలను సమగ్రంగా అభివృద్ధి చేయడం, ఉపాధి వేతనదారులకు దినసరి వేతనం రూ.300 వచ్చేలా చేయడం లక్ష్యంగా నిర్దేశించామన్నారు. ఇందులో భాగంగా నీటితొట్టెల నిర్మాణం పనులకు కలెక్టర్ మంగళవారం తాండ్రంగిలో పశువైద్య శాల ఆవరణలో రూ.33 వేల వ్యయంతో నిర్మించనున్న పశువుల నీటితొట్టె నిర్మాణం పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరం లో 306 నీటితొట్టెల నిర్మాణం చేపట్టాలని గుర్తించామని, ప్రస్తుతం 46 నీటితొట్టెలను రూ.15.74 లక్షలతో మంజూరు చేశామని తెలిపారు. కార్యక్రమంలో డ్వామా పీడీ ఎస్.శారదాదేవి, జెడ్‌పి సిఇఒ బివి సత్యనారాయణ, మండల ప్రత్యేక అధికారి కుమారస్వామి, ఎంపిడిఒ ఎన్.అప్పలనాయుడు, తహశీల్దార్ కృష్ణలత, స్థానిక ఎపిఒ కిరణ్మయి పాల్గొన్నారు.

గ్రామస్తుల సమస్యలపై స్పందించిన కలెక్టర్

తాండ్రంకి గ్రామస్తులతో కలెక్టర్ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తాండ్రంకి-తానవరం గ్రామాల మధ్య ప్రజలు వెళ్లివచ్చేందుకు వీలుగా గోస్తనీ నదిపై వంతెన నిర్మించాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేయగా వెంటనే రోడ్లు భవనాల ఎస్ఇకి ఫోన్ చేసి ఎఇని పంపించి వంతెన నిర్మాణానికి అంచనాలు రూపొందించి అందజేయాలని ఆదేవించారు. కొట్టాం-విజయనగరం మధ్య బస్సును పునరుద్ధరించాలని కోరగా జిల్లా ప్రజారవాణా అధికారికి ఫోన్ చేసి ట్రయల్ రన్ నిర్వహించాలని ఆదేశించారు. ఇనాం భూములకు సంబంధించి పరిష్కరించాల్సిన సమస్యలు వున్నాయని పలువురు రైతులు పేర్కొనగా దానిపై రెవిన్యూ రికార్డులను పరిశీలించి తగిన చర్యలు చేపడతా మన్నారు. గ్రామంలో పలువురు ఫించనుదారులకు కలెక్టర్ పింఛను మొత్తాలు పంపిణీ చేశారు. విజినిగిరి గ్రామంలోనూ పర్యటించి ఫించన్ల పంపిణీని పరిశీలించారు.

నిరసన తెలుపుతున్న కార్మికులు, సిఐటియు నాయకులు

మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

ప్రజాశక్తిగీవిజయనగరం టౌన్

టిడిపి కూటమి ప్రభుత్వం ఆప్కాస్‌ను రద్దు చేస్తే మొత్తం మున్సిపల్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) విజయనగరం కార్పొరేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎ.జగన్మోహన్‌రావు, బి.భాస్కరరావు డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా మంగళవారం సాయంత్రం నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే మంచి జరుగుతుందని ఆశించామని, అందుకు భిన్నంగా ఆప్కాస్ ను రద్దుచేసి ప్రైవేట్ ఏజెన్సీలకు ఇవ్వాలని ఫిబ్రవరి 6న జరిగిన క్యాబినెట్ సమావేశంలో నిర్ణయం చేయడం కార్మికులను ఇబ్బందిపెట్టడమేనని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకొని మొత్తం కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, నేరుగా మున్సిపాలిటీ ద్వారా జీతాలు చెల్లించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ప్రభుత్వ ఉద్యోగుల 62 సంవత్సరాల వరకు కొనసాగించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ ఇవ్వాలని, పర్మినెంట్ ఉద్యోగుల సరెండరీ డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. థర్డ్ పార్టీలో ఉన్న లీకులు, వాలా ఆపరేటర్లు, పంప్ హౌస్, ప్లాంటేషన్, విలీన ప్రాంత కార్మికులకు జీవో నెంబర్ 36 ప్రకారం పిహెచ్ వర్కర్లతో సమానంగా జీతాలు చెల్లించాలని, వారాంతపు సెలవులు, పండగ, జాతీయ సెలవు దినాలు, సిక్, క్యాజువల్ లీవులు వర్తింపచేయాలని కోరారు. ఈ సమస్యలపై సంతకాలను సేకరించి మున్సిపల్ శాఖ మాత్యులు డాక్టర్ నారాయణకు ఈనెల 10న సమర్పిస్తామని, ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోతే సమ్మెకు సిద్ధం కావలసి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు రజిని, కృష్ణ, కుమారి, రమ, చిన్ని, శంకర్రావు ,రాఘవ, రామరాజు, భాస్కర్ రావు, వంశి, రమణ, సూరి తదితరులు పాల్గొన్నారు.

సుజల స్రవంతి కాలువ డిజైన్‌పై మంత్రికి పోరాట కమిటీ వినతి

ప్రజాశక్తి-విజయనగరం

సుజలస్రవంతి కాలువ డిజైన్ మార్చాలని కోరుతూ పోరాట కమిటీ నాయకులు రాష్ట్రమంత్రి కొండపల్లి శ్రీనివాసరావును మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో కలిశారు. కాలువ ప్రత్యమ్నాయ డిజైన్ సాధ్యాసాధ్యాలు మంత్రికి నాయకులు వివరించారు. అనంతరం ఎస్.కోట కొత్తూరు నుంచి గడిగెడ్డ వరకు ఎటువంటి పనులూ చేపట్టవద్దని ఇరిగేషన్ అధికారులకు మంత్రి ఆదేశించారు. ప్రత్యామ్నాయ కాలువ పరిశీలించిన అనంతరం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.రాంబాబు, పోరాట కమిటీ గౌరవాధ్యక్షులు గౌరినాయుడు, కన్వీనర్ చల్లా జగన్, కో కన్వీనర్ బోదంకి అప్పల నాయుడు ఉన్నారు. చర్చల్లో ఐదు మండలాల రైతులు, రిటైర్డు డిఇ దొగ్గ దేవుడు పాల్గొన్నారు. అనంతరం రైతులతో నాయకులు మాట్లాడుతూ కాలువ డిజైన్ మార్చేవరకు పనులు జరిగితే అడ్డుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రికి ధన్యవాదాలు తెలిపారు.

త్వరలో విపణికల్ప వాణిజ్య సముదాయం ఆధునికీకరణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరపాలక సంస్థకు చెందిన విపణికల్ప వాణిజ్య సముదాయాన్ని త్వరలో ఆధునికీకరించ నున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య తెలిపారు. వాణిజ్య సముదాయంలో దుకాణదారులకు దుకాణాలు ఖాళీ చేయాలని ఆదేశాలిచ్చామన్నారు. వారంతా మంగళవారం షాపులను ఖాళీ చేశారన్నారు. సహాయ కమిషనర్ కె.అప్పలరాజు, రెవెన్యూ సిబ్బందితో కలిసి విపణికల్ప ప్రాంతానికి వెళ్లి దుకాణాలు ఖాళీ చేస్తున్న ప్రక్రియను పరిశీలించారు.

శ్రీ రామనవమికి ఘనంగా ఏర్పాట్లు

- భక్తులకు ఎటువంటి అసౌకర్యమూ కలగకూడదు : ఆర్‌డిఒ
- స్వామివారికి మంత్రి కొండపల్లి పట్టు వస్త్రాలు సమర్పణ

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డిఒ డి.కీర్తి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ఈ నెల 6న శ్రీరామ నవమి సందర్భంగా కళ్యాణోత్సవానికి ఏర్పాట్లను పక్కాగా చేయాలని ఆర్‌డిఒ డి.కీర్తి తెలిపారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యమూ కలగకుండా చూడాలన్నారు. మంగళవారం ఆమె రామతీర్థం రామస్వామి దేవాలయం వద్ద కల్యాణోత్సవం ఏర్పాట్లపై అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భక్తులు కల్యాణాన్ని ప్రశాంతంగా వీక్షించి, సంంతృప్తిగా వెళ్ళేలా చూడాలన్నారు. దేవాదాయ శాఖ క్యూలైన్ల ఏర్పాట్లను, ప్రసాదాలను, షామియానాల, కళ్యాణ ఏర్పాట్లను చూడాలన్నారు. గట్టి బందోబస్తు ఏర్పాట్లను పోలీస్ శాఖ చేయాలని, ప్రధానంగా స్వామి వారి కళ్యాణ అక్షింతల పంపిణీ వద్ద 3 లైన్ల రోప్ పార్టీని వేయాలని తెలిపారు. వేసవి, వడగాల్పులను దృష్టిలో పెట్టుకొని తాగు నీరు, మజ్జిగ ప్యాకెట్లను స్వచ్ఛంద సంస్థల ద్వారా సరఫరా చేసేలా చూడాలన్నారు. తాగు నీరు, ప్రసాదం, మజ్జిగ సురక్షితంగా ఉండాలని, ప్యాకెట్లలో సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని, లేనియెడల కలుషితం అయ్యే అవకాశం ఉంటుందని, తగు జాగ్రత్తలు తీసుకొని సరఫరా చేయాలని సూచించారు. వైద్య ఆరోగ్య శాఖ ద్వారా మెడికల్ క్యాంపును, 104, 108 వాహనాలను, ఒఆర్ఎస్ ప్యాకెట్లను ఏర్పాటు చేయాలన్నారు. వేర్వేరు రూట్లలో వచ్చే భక్తుల కోసం తగు బస్సులను ఏర్పాటు చేయాలని ఆర్‌టిసి యాజమాన్యానికి సూచించారు. ట్రాఫిక్ జామ్ కాకుండా 3 మార్గాలలో తగు ఏర్పాట్లు చేయాలనీ, వాహనాల పార్కింగ్ కోసం కూడా మార్కింగ్ చేయాలనీ, ట్రాఫిక్ పోలీస్ వారికీ, నిరంతర విద్యుతు సరఫరా ఉండేలా చూడాలని విద్యుత్ శాఖ అధికారులకు, ముందస్తు రక్షణగా ఫైర్ ఇంజిన్ సిద్ధంగా ఉంచాలని ఫైర్ శాఖ వారికీ ఆదేశాలు జారీ చేశారు. పారిశుధ్యం అతి ప్రధానమైన అంశమని, వాటర్ ప్యాకెట్లు ఎక్కడికక్కడే పడి ఉంటాయని, వెంటనే శుభ్రం చేయించాలని, అవసరమైన సిబ్బందిని ముందే అన్ని కేంద్రాల వద్ద వేయాలని సూచించారు. మొబైల్ టాయిలెట్లను కూడా ఏర్పాటు చేయాలని తెలిపారు.

పట్టు వస్త్రాలు సమర్పించనున్న మంత్రి

శ్రీరాముని కళ్యాణంలో భాగంగా స్వామివారికి మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పిస్తారని, ఉదయం 10.30గంటలకు కళ్యాణం జరిపిస్తారని చెప్పారు. ఈ సమావేశంలో దేవాలయ ఇఒ, అసిస్టెంట్ కమిషనర్ వై.శ్రీనివాసరావు, ప్రధాన అర్చక సాయి రామాచార్యులు, జిల్లా పరిషత్ సిఇఒ సత్యనారాయణ, డిపిఒ వెంకటేశ్వరరావు, ఎంపిడిఒ రామకృష్ణరాజు, తహశీల్దార్ సుదర్శన రావు, డిఎస్‌పి శ్రీనివాసరావు, జిల్లా ఫైర్ అధికారి రాం ప్రకాష్, ఆర్‌డబ్ల్యుఎస్, విద్యుత్, ఆర్అండ్‌బి, ఆర్‌టిసి, వైద్య ఆరోగ్య శాఖ, పోలీస్ తదితర శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు సువ్వాడ రవిశేఖర్, మాజీ సర్పంచ్ రాము, దేవాలయ సిబ్బంది, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి బిల్లులు చెల్లించాలి

ప్రజాశక్తి - బొబ్బిలి

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ బిల్లులు చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.గోపాలం, సిఐటియు జిల్లా అధ్యక్షుడు వి.శంకరరావు డిమాండ్ చేశారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో మంగళవారం వారు మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరంలో జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలలో చేసిన పనులకు బిల్లులు చెల్లించకపోవడంతో వేతనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణమే ఉపాధి బకాయి బిల్లులు చెల్లించాలని, ఏడాదికి 100 రోజులు పని కల్పించి కనీస వేతనం రోజుకు రూ.300 ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిచో పోరాటం చేస్తామన్నారు.

షిఫ్టుల వారీగా మిల్లు తిప్పాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

జ్యూట్ మిల్ సైరన్ వేసి షిఫ్టుల వారీగా మిల్లు తిప్పాలని జ్యూట్‌మిల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన స్థానిక జ్యూట్ మిల్ గేటు వద్ద కార్మికులనుద్దేశించి మాట్లాడుతూ జ్యూట్ యాజమాన్యం లాక్ ఔట్ తరువాత మిల్ నిర్వహణ పనులు ముగించి ఉత్పత్తి ప్రారంభించిందన్నారు. అయితే సైరన్ వేయకుండా పాడి కూలీ పేరిట మిల్లు తిప్పడం దారుణమన్నారు. ముఖ్యంగా పాడి కూలీకి మిల్లు తిప్పితే కార్మికుల సిక్ లీవ్, ఇఎస్ఐ, పిఎఫ్ వంటి హక్కులు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. జ్యూట్ యాజమాన్యం సైరన్ వేసి షిఫ్టుల వారీగా ఎ,బి,సి గ్రూపుల వారీగా మిల్లు తిప్పాలని డిమాండ్ చేశారు. జ్యూట్ చర్చల్లో లేబర్ కమిషనర్ వద్ద చేసుకున్న ఒప్పందం ప్రకారం మిల్లు తిప్పి ఇఎస్ఐ, పిఎఫ్ బకాయిలు ప్రభుత్వానికి వెంటనే చెల్లించి కార్మికులు, రిటైర్డ్ కార్మికులకు పింఛన్ సౌకర్యం, ఇఎస్ఐ ఆసుపత్రి వైద్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కాగా కార్మికులు క్రమశిక్షణ తో మెలిగి నిర్లక్ష్యం వహించకుండా ఉత్పత్తి అందించి మిల్లును కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. కార్మికులకు ఏ సమస్య వచ్చినా అండగా నిలిచి పోరాటం చేస్తానని భరోసా ఇచ్చారు.

11న పూలే, అంబేద్కర్ జయంతోత్సవాలు

ప్రజాశక్తి - శృంగవరపుకోట

మహాత్మాజ్యోతిబాపూలే, బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి మహోత్సవాలను ఈ నెల 11న మండలంలోని శివరామరాజుపేట గ్రామంలో జైభీమ్ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు కొట్యాడ జగదీష్, పి.వెంకటరమణ, మెయ్యి వెంకటరమణ, కురదొడ్డి వెంకట అప్పారావు మంగళవారం తెలిపారు. పేదల అభ్యున్నతికోసం జీవితాలను ధారబోసిన మహనీయుల జయంతిని ప్రజా ప్రతినిధులు, బహుజన మేధావులు, పూలే అంబేద్కర్ వాదులు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అనంతరం గోడ పత్రికను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో కె.దుర్గాభవాని, కె.కొండమ్మ, కొంకి లక్ష్మి, కె.దేవి పాల్గొన్నారు.

మద్యం వద్దు..ఆరోగ్యం ముద్దు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మద్యం వద్దు ఆరోగ్యం ముద్దు అంటూ మాజీ ఆర్మీ ఉద్యోగులు మంగళవారం స్థానిక రామతీర్థం కూడలిలో మద్యం షాపు వద్ద అవగాహన కల్పించారు. మద్యం షాప్ వద్ద గొర్లిపేట, గుర్ల మండలం కెల్ల గ్రామాలకు చెందిన మాజీ ఆర్మీ ఉద్యోగులు రామ్మూర్తి, సారిక అప్పారావు మద్యం వద్దు ఆరోగ్యం ముద్దు అంటూ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మద్యం షాపుకు వచ్చి మద్యం తాగకుండా వెళ్లిన వారికి సుమారు 30వేల రూపాయలు విలువ అందజేసి వినూత్న కార్యక్రమం నిర్వహించారు. మద్యం వల్ల ఎందరో జీవితాలు కోల్పోయి కుటుంబాలను నాశనం చేసుకోకుండా చూసి మద్యం మానిపించి వారికి అండగా నిలవాలని అవగాహన కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు.

గ్రామసభలు సక్రమంగా నిర్వహించాలి

ప్రజాశక్తి- శృంగవరపుకోట

ఈ నెల 14వ తేదీ నుంచి నిర్వహించే గ్రామ సభలను సక్రమంగా నిర్వహించాలని ఓటరు అక్షరాస్యత వేదిక వ్యవస్థాపకులు డి.సూర్యారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న 13,326 పంచాయతీలలో రాజ్యాంగబద్ధ గ్రామసభలు సక్రమంగా నిర్వహించేలా అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి మంత్రి పవన్ కళ్యాణ్‌కి వినతి పూర్వకంగా తెలియజేశామన్నారు. మన రాష్ట్రంలో రాజ్యాంగబద్ధ గ్రామసభలు 2013 నుంచి అమల్లోకి వచ్చాయని ఏటా నాలుగు గ్రామసభలు జరుగుతాయని ఈ ఏడాది మొదటి గ్రామసభ బడ్జెట్ ప్రణాళిక పేరుతో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి రోజు నుంచి జరగనున్నాయని మినీ పార్లమెంట్ మినీ అసెంబ్లీగా పిలవబడే ఈ రాజ్యాంగబద్ధ గ్రామసభలను విజయవంతంగా నిర్వహించి మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్య స్థాపనకు పూనుకోవాలని కోరమన్నారు. ఈ కార్యక్రమంలో వేదిక ప్రతినిధులు రిటైర్డ్ తహశీల్దారు వి.సన్యాసప్పుడు, ఆర్ సూర్యదేముడు, ఎల్.సాంబమూర్తి, జి.ధనుంజయ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వితంతువులకు కొత్త పింఛన్లు పంపిణీ

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని సంకిలి, చిన్నయ్యపేట గ్రామాల్లో భర్త చనిపోయిన భార్యలకు పొచింగ్ ద్వారా కొత్త పింఛన్లు మంగళవారం సర్పంచ్ బుడుమూరు పట్టాభి, టిడిపి సీనియర్ నాయకులు నారు జనార్ధనరావు, నాయకులు గంగు కృష్ణ, కె రమణ, జనసేన నాయకులు బలసా శ్యామ్ పంపిణీ చేశారు. గత వైసిపి పాలనలో భర్త చనిపోయిన పింఛన్ ప్రక్రియ నిలుపుదల చేయడంతో ఎన్నో ఇబ్బందులు పడ్డారని తెలిపారు. కూటమి ప్రభుత్వం రాగానే భర్త చనిపోయిన భార్యలకు పొచింగు ద్వారా పింఛన్లు అందజేయడం సంతోషిదాయకమన్నారు.

ఎమ్‌డియు ఆపరేటర్‌కు షోకాజ్ నోటీసు

ప్రజాశక్తి - భోగాపురం

భోగాపురంలో రేషన్ సరుకులు పంపిణీ చేస్తున్న ఎండియు ఆపరేటర్‌కు తహశీల్దార్ ఎం. సురేష్ షోకాజ్ నోటీసు జారీ చేశారు. ఈ మేరకు పౌరసరఫరాల డిప్యూటీ తహశీల్దార్ మురళీకృష్ణ ఆపరేటర్‌కు ఈ షోకాజ్ నోటీసును మంగళవారం అందజేశారు. ఆపరేటర్‌గా చేస్తున్న పెంటుమాని నారాయణరావు భోగాపురం గ్రామంలోని మూడు డిపోలకు వాహనం ద్వారా సరుకులు పంపిణీ చేస్తుంటారు. అయితే విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నట్టు ఆరోపణలు రావడంతో పాటు సరుకులు పంపిణీ చేసిన అనంతరం మిగిలిన సరుకులను డీలర్లకు సరిగ్గా తిరిగి ఇవ్వడం లేదు. సరుకులు అమ్మిన తర్వాత వచ్చిన సొమ్మును కూడా సక్రమంగా తిరిగి ఇవ్వడం లేదని రేషన్ డీలర్లు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. కొంతమంది లబ్ధిదారులు కూడా సరుకులు సక్రమంగా అందజేయడం లేదని ఫిర్యాదులు చేశారు. దీనిపై అధికారులు పలుమార్లు హెచ్చరించినప్పటికీ పట్టించుకోకపో వడంతో ఆయనకు షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు సిఎస్ డీటీ తెలిపారు.

విధుల్లో చేరిన ఎంపిడిఒ కిషోర్‌కుమార్

ప్రజాశక్తి - భోగాపురం

మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒగా కె.కిషోర్ కుమార్ మంగళవారం మళ్లీ విధుల్లోకి చేరారు. ఈ ఏడాది జనవరిలో వ్యక్తిగత పనుల మీద ఆయన సెలవులోకి వెళ్లారు. దీంతో ఇఒపిఆర్‌డి కె.గాయత్రికి ఇంచార్జ్ బాధ్యతలు అప్పజెప్పారు. సెలవులు ముగియడంతో ఆయన తిరిగి విధుల్లోకి చేరారు.

టిడిపి నాయకులపై ఫిర్యాదు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నిబంధనలను ఉల్లంఘిస్తూ టిడిపి నాయకులు ఆ పార్టీ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా రహదారికి ఇరువైపులా జెండాలు కట్టడంపై కార్పొరేషన్ కమిషనర్‌కు అంబేద్కర్ రైట్స్ ఫోరం అధ్యక్షులు బి.భానుమూర్తి ఫిర్యాదు చేశారు. తక్షణమే తెలుగుదేశం పార్టీ జెండా నిర్మాణాలను తొలగించాలని కోరారు.

మతోన్మాదంపై పోరాడాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ స్ఫూర్తితో మతోన్మాదాన్ని పెంచి పోషిస్తున్న పాలకుల విధానాలపై పోరాడాలని నవ యువ సమాఖ్య నాయకులు పిలుపునిచ్చారు. నాయకుల 94వ వర్ధంతి సభ అంబటి సత్రం వద్దగల ప్రెస్‌క్లబ్‌లో ఎన్‌వైఎస్ జిల్లా అధ్యక్షులు ఎం.అప్పలరాజు అధ్యక్షతన మంగళవారం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన పిడిఎస్‌ఒ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.భాస్కరరావు మాట్లాడుతూ నేడు దేశంలో మతాన్ని ఉపయోగించుకుని మత ఉన్మాదాన్ని ప్రజల్లో రెచ్చగొట్టే విధంగా పాలన సాగుతోందని అన్నారు. అటువంటి పాలనకు వ్యతిరేకంగా భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవ్‌ల స్ఫూర్తితో ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలువురు యువకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫారంపాండ్స్‌తో భూగర్భ జలాల పెంపు : మంత్రి

ప్రజాశక్తి- గంట్యాడ

ఫారంపండ్స్ పనులతో భూగర్భ జలాల స్థాయి పెరుగుతోందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని కొత్తవెలగాడ గ్రామంలో మంగళవారం ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించిన పారం పాండ్స్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫారం పాండ్స్ నిర్మాణం చక్కగా చేసిన మహిళ ఉపాధి వేతనదారులను మంత్రి అభినందించారు. అనంతరం ఉపాధి వేతనదారులతో సామూహిక ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ ఆర్‌వి రమణమూర్తి, ఉపాధిహామీ ఎపిఒ సుందర్రావు, గంచాడు మండల టిడిపి అధ్యక్షుడు కొండపల్లి భాస్కర్ నాయుడు, రాష్ట్ర కొప్పులవెలమ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ డైరెక్టర్ అల్లు విజయకుమార్, గ్రామ సర్పంచ్ దాలమ్మ, టిడిపి నాయకులు, గ్రామ పెద్దలు ఉపాధి వేతనదారులు పాల్గొన్నారు.

గంట్యాడ: ఫారం పాండ్ పనులు ప్రారంభిస్తున్న మంత్రి శ్రీనివాస్

పశువులకు నీటి తొట్టి నిర్మాణానికి భూమి పూజ చేసిన ఎమ్మెల్యే

వేపాడ: మండలంలోని జాకేరులో మంగళవారం పశువులు వేసవి కాలంలో తాగునీటికి ఇబ్బందులు లేకుండా ఉపయోగపడే విధంగా ఉండేందుకు ఉపాధి హామీ నిధులతో నీటి తొట్టెల నిర్మాణానికి ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒక్కొక్క నీటి తొట్టి నిర్మాణానికి రూ.33వేలు ఖర్చు చేస్తున్నామని ఈ నీటి తొట్టెల నిర్మాణం వేసవి కాలంలో పశువులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు. అధిక సంఖ్యలో రైతులు నీటితొట్టి నిర్మాణాలు చేపట్టి పశువులకు నీటికి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు రైతులు ముందుకు రావాలని కోరారు. రైతులకు పశుగ్రాసం నిమిత్తం 75 శాతం రాయితీతో పశుగ్రాస విత్తనాలు కూడా అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ, ఎపిఒ ఆదిలక్ష్మి, పశు వైద్యాధికారి, సర్పంచ్ బుద్ధ చిన్నమ్మలు, అప్పలనాయుడు, నాయకులు దాసరి లక్ష్మి, మండల టిడిపి ప్రధాన కార్యదర్శి రమణమూర్తి, ఉపాధ్యక్షుడు పి.రమణ తదితరులు పాల్గొన్నారు.

మూగ జీవాలకు ప్రభుత్వ సాయం : ఎమ్మెల్యే

బొబ్బిలిరూరల్ : మూగ జీవాలకు ప్రభుత్వం సాయమందిస్తోందని ఎమ్మెల్యే బేబినాయన అన్నారు. మంగళవారం కొత్తపెంట గ్రామంలో ఉపాధి హామీ నిధులతో పశువుల తాగినీటి తొట్లు నిర్మాణ పనులకు శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ తమ ప్రభుత్వంలో పాడి రైతులకు మేలు చేకూర్చే విదంగా అనేక కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. పాడి పశువులు సేద తీరేందుకు మండలంలో 160 గోకులాలు, వేసవిలో మేతకు వెళ్లే పశువులు నీళ్ళు త్రాగేందుకు 6 నీటి తొట్టెలు మంజూరు చేశామన్నారు. వీటిని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంతరం పింఛన్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ ఎడి విష్ణు, ఎంపిడిఒ రవి కుమార్, వైద్యులు సతీష్, ఉపాధి హామీ ఎపిఒ లక్ష్మీపతిరాజు, టిడిపి మండల అధ్యక్షులు వి.సత్యనారాయణ, మెట్టవలస సర్పంచ్ పి.మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి: భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే బేబినాయన

టిడిపి నాయకులకు చెప్పి చేయాలి

అధికారులను ఆదేశించిన మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలో గ్రామాల అభివృద్ధి పనులు, ఏ ఇతర పనులైన గ్రామాల్లో ఉన్న టిడిపి నాయకులు, కార్యకర్తలకు అధికారులు చెప్పి చేయాలని రాష్ట్ర మార్క్ఫెడ్ చైర్మన్, నెల్లిమర్ల నియోజకవర్గం టిడిపి ఇంఛార్జి కర్రోతు బంగారు రాజు అధికారులను ఆదేశించారు. మండల కేంద్రంలో ఉన్న అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు నాయకులను కార్యకర్తలను వెంట తీసుకొని మంగళవారం వెళ్లి మండల స్థాయి అధికారులకు టిడిపి నాయకులను కార్యకర్తలను పరిచయం చేసి కొన్ని పేర్లతో కూడిన జాబితాలను అధికారులకు ఇచ్చారు. ఈ జాబితాలో ఉన్న పేర్లను పరిశీలించి ఆయా గ్రామాల్లో ఎటువంటి కార్యక్రమం జరిగినా వారికి సమాచారం ఇవ్వాలన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి పది నెలల కావస్తున్నా గ్రామాల్లో ఉన్న టిడిపి నాయకులకు, కార్యకర్తలకు అధికారులు ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించి ఎటువంటి సమాచారమూ ఇవ్వడం లేదన్నారు. గ్రామ, మండల స్థాయి నాయకుల మాట అధికారులు వినడం లేదని తన దృష్టికి వచ్చిందని ఇక నుంచి అలా జరగడానికి వీలు లేదని అందుకే నాయకులు కార్యకర్తలను వెంట పెట్టుకుని వచ్చానని స్పష్టం చేశారు. జనసేన నాయకులు, కార్యకర్తలు చెప్పిన పనులు మాత్రమే చేస్తున్నారని టిడిపి వారు చెప్పినా అధికారులు పట్టించుకోవడం లేదని ఇప్పటికైనా అధికారులందరూ గ్రామాల్లో ఉన్న టిడిపి నాయకులకు కార్యకర్తలకు చెప్పాలని, వారు చెప్పిన పనులు చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం కార్యకర్తలు నాయకులను వెంటబెట్టుకుని ఎంపిడిఒ, తహశీల్దార్, పోలీసు స్టేషన్ అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లి అధికారులకు నాయకులను కార్యకర్తలను పరిచయం చేసి గ్రామాల్లో ముఖ్యమైన నాయకులు, కార్యకర్తలు ముగ్గురు నలుగురు పేర్లుతో కూడిన లిస్టులను అధికారులకు అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్‌పిటిసి పతివాడ అప్పలనారాయణ, నాయకులు రాజు తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు

277 దరఖాస్తులు పరిశీలన

ప్రజాశక్తి - వేపాడ

స్థానిక మండల పరిషత్తు సమావేశం మందిరంలో జిల్లా బీసీ సొసైటీ నుంచి వివిధ రకాల రుణాలు కోసం చేసుకున్న 277 దరఖాస్తులను ఎంపిడిఒ సిహెచ్ సూర్యనా రాయణ ఆధ్వర్యంలో బొద్దాం, వేపాడ గ్రామీణ బ్యాంక్ మేనేజర్లు, కోఆపరేటివ్ సహకారం సంఘం బ్యాంకు, స్టేట్ బ్యాంక్ సిబ్బంది పరిశీలన చేశారు. దరఖాస్తుదారులకు సబ్సిడీతో కూడిన రుణాలు మంజూరు చేయడానికి అర్హుల జాబితాను జిల్లా కేంద్రానికి పంపిస్తామన్నారు.

వేపాడ: ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న ఎంపిడిఒ

నేడు లబ్ధిదారుల ఎంపిక

రాజాం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం వివిధ కార్పొరేషన్ ద్వారా రుణాలు మంజూరు నిమిత్తం లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తామని ఎంపిడిఒ శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలం వ్యాప్తంగా 480 మంది దరఖాస్తు చేసుకున్నారని, ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామని చెప్పారు. అందరూ సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు.

శృంగవరపుకోట: బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తులు చేసుకున్న వారికి స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో బ్యాంకు వారిచే నేడు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని ఎంపిడిఒ సతీష్ మంగళవారం తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ కార్పొరేషన్ లోన్స్ ఇంటర్వ్యూలు ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమవుతాయని రుణాలు కోసం దరఖాస్తులు చేసుకున్న వారు విద్యార్హతలు తెలిపే సర్టిఫికెట్, లోన్ దరఖాస్తు ఫారం, రేషన్ కార్డ్, ఆదార్ కార్డ్, బ్యాంక్ పాస్ బుక్, క్యాస్ట్ సర్టిఫికేట్, ఒరిజినల్ జెరాక్స్ కాపీలని తీసుకొని రావాలని తెలిపారు.

ఎంఎంసి రేస్‌లో ఐదుగురు

- మొదటి విడతలో తేలని మార్కెట్ కమిటీ చైర్మన్ ఎంపిక
- పెరుగుతున్న ఆశావహులు
- ఎటూ తేల్చని స్థానిక ఎమ్మెల్యే

ప్రజాశక్తి - చీపురుపల్లి

చీపురుపల్లి మార్కెట్ కమిటీ ఛైర్మన్ల నియామకంలో తెలుగుదేశం పార్టీకి చెందిన ఐదుగురు నాయకులు రేసులో ఉన్నట్లు సమాచారం. దీనికి సంబంధించి రాష్ట్ర పార్టీ నాయకత్వం వీరిలో ఒకరికి ఛైర్మన్ పదవిని కట్టబెట్టేందుకు తుది మెరుగులు దిద్దుతున్నట్లు తెలిస్తోంది. అయితే స్థానిక ఎమ్మెల్యే కళా వెంకటరావు మాత్రం ఎవరికీ మాట ఇవ్వకుండా మౌనంగా ఉండడంతో టిడిపి నాయకులలో కొంత అసహనం నెలకొందని తెలుగు తమ్ముళ్ల గుర్రుమంటున్నారు. రాష్ట్ర పార్టీ వద్ద రెడ్డి గోవిందనాయుడు, మహంతి రమణమూర్తి, సారిపాక సురేష్, మీసాల శ్రీధర్‌నాయుడు, వలిరెడ్డి శ్రీరాములనాయుడు పేర్లు ఉన్నట్లు టిడిపి నాయకులలో చర్చ జరుగుతోంది. పేర్లన్నీ అధిష్టానం దృష్టిలో ఉన్నప్పటికీ స్థానిక ఎమ్మెల్యే మాత్రం ఎవరికి ప్రాధాన్యత ఇవ్వాలన్న దానిపై ఇంకా ఒక కొలిక్కిరాలేదని ప్రచారం జరుగుతోంది. అధిష్టానం వద్ద ఉన్న ఐదుగురి తెలుగుదేశం నాయకులు మొదటి నుంచి పార్టీ విధేయులుగా కష్టపడి పని చేసిన వారే.

గోవిందనాయుడు

వీరిలో రెడ్డి గోవిందనాయుడు 2012లో జరిగిన జెడ్‌పిటిసి ఎన్నికలలో మెరకముడిదాం మండలంలో ఎస్‌సి కేటగిరికి చెందిన పెందుర్తి సింహాచలంను గెలిపించడంలో కీలక పాత్ర పోషించాడు. 2014లో జరిగిన ఎన్నికలలో కిమిడి మృణాలినిని గెలిపించడంలో కూడా మెరకముడిదాం మండలంలో గోవిందనాయుడు కష్టపడి పని చేశారు. 2024 ఎన్నికలలో కిమిడి కళావెంకటరావుకి టిక్కెట్టు ఇచ్చేటప్పుడు మొట్టమొదటిసారిగా మద్దతు ఇచ్చిన నాయకుడు కూడా రెడ్డి గోవిందనాయుడే. గరివిడి మండలం అర్తమూరు గ్రామానికి చెందిన మహంతి రమణమూర్తి ప్రస్తుతం మండల పార్టీ ప్రధానకార్యదర్శిగా పని చేస్తున్నాడు. 1995 నుండి తెలుగుదేశం పార్టీలోనే ఉంటూ పార్టీకి అండగా నిలబడ్డాడు. పార్టీలో మొదటి నుండి మండల స్థాయి పదవులను చేస్తున్నాడు. జిల్లా తెలుగు యువత ప్రధాన కార్యదర్శిగానూ పని చేశాడు. 2014, 2024లలో కిమిడి మృణాలిని, కిమిడి కళావెంకటరావుల గెలుపునకు కృషి చేశారు. గరివిడి టిడిపి మండల అధ్యక్షుడిగా పనిచేస్తున్న సారిపాక సురేష్ పేరు కూడా రాష్ట్ర పార్టీ దృష్టిలో ఉన్నట్లు సమాచారం. సురేష్ గతంలో చీపురుపల్లి ఆర్‌ఇసిఎస్ వైస్‌ఛైర్మన్‌గా పని చేశారు. సురేష్ తండ్రి సారిపాక చిన్నబాబు పార్టీ ఆవిర్భావం నుండి టిడిపిలో సేవలందించారు. చీపురుపల్లి మండలానికి చెందిన మీసాల శ్రీదర్‌నాయుడు పేరు కూడా రాష్ట్ర పార్టీ పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. మండలంలో ఇటికర్లపల్లి గ్రామానికి చెందిన శ్రీధర్‌నాయుడు తండ్రి మీసాల శ్రీరాములనాయుడు గతంలో చీపురుపల్లి ఎఎంసి ఛైర్మన్‌గా పని చేశారు. ఈ కుటుంబం కూడా పార్టీ ఆవిర్భావం నుంచి కొనసాగుతూ ఎమ్మెల్యేల గెలుపులో కీలకపాత్ర పోసిస్తున్నారు. ఇదే మండలం పాలవలసకు చెందిన వలిరెడ్డి శ్రీరాములనాయుడు పేరు కూడా రాష్ట్ర పార్టీ పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. శ్రీరాములనాయుడు మాజీ ఎమ్మెల్యే గద్దె బాబూరావుపై గతంలో పెదనడిపల్లి సొసైటీ ఎన్నికలలో పోటీ చేసి విజయం సాధించి సంచలనం సృష్టించారు. అనంతరం కొంత కాలం కాంగ్రెస్‌లో ఉన్న శ్రీరాములనాయుడు టిడిపిలో చేరి పార్టీ గెలుపునకు కృషి చేస్తున్నట్లు తెలుగుతమ్ముళ్ల చెబుతున్నారు.

ఎం. రమణమూర్తి

శ్రీధర్‌నాయుడు

సారిపాక సురేష్

శ్రీరాములనాయుడు

పోటీలో జనసేన నాయకులు

ఇది ఒక ఎత్తైతే జనసేన నాయకులు సైతం తమకూ చీపురుపల్లి గాని, మెరకముడిదాం మార్కెట్ కమిటీలలో ఒకటి ఇప్పించాలంటూ తమ అధిష్టానం వద్ద ప్రస్తావించినట్లు సమాచారం. పార్టీలో అర్థ బలం ఉన్న వారి వైపే స్థానిక పార్టీ నాయకులు మొగ్గు చూపుతున్నట్లు తెలుగు తమ్ముళ్ల చర్చించుకుంటున్నారు. ఈ సారి పార్టీ కోసం కష్టపడిన వారికి కాకుండా వేరే వ్యక్తికి ఎవరికైనా ఇస్తే తమ దారి తాము చూసుకుంటామంటూ తెలుగు తమ్ముళ్ల బహిరంగంగానే చెబుతున్నారు. రాష్ట్ర పార్టీ పరిశీలనలో ఉన్న పేర్లులో ఎవరికి స్థానిక ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు ఆశీస్సులు ఉంటాయో వేచి చూడాల్సి ఉంది.



అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్

పెండింగ్ పనులను పూర్తి చేయాలి

ప్రజాశక్తి - బొబ్బిలి

మున్సిపాలిటీలో పెండింగ్ అభివృద్ధి పనులు పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను కమిషనర్ ఎల్.రామలక్ష్మి కోరారు. మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ఆమె ఇంజినీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. పెండింగ్ అభివృద్ధి పనులను వేగవంతం చేసి ఈ నెల 5లోగా పూర్తి చేయాలన్నారు. మున్సిపాలిటీలో వేసవిలో తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడకుండా చూడాలన్నారు. వేగావతి నది ఎండిపోవడంతో పెద్దగెడ్డ నీరు విడుదల చేసేందుకు ఇరిగేషన్ అధికారులకు లేఖ రాయాలని ఆదేశించారు. వీధి దీపాలు నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో మున్సిపల్ డిఇ పి.కిరణ్ కుమార్, ఎఇలు గుప్తా, కోటేశ్వరరావు ఉన్నారు.

మున్సిపాలిటీలో రూ.4.83కోట్లు పన్ను వసూలు

బొబ్బిలి మున్సిపాలిటీలో రూ.4.83కోట్లు ఆస్తిపన్ను వసూలు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి చెప్పారు. మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ఆమె మాట్లాడుతూ బొబ్బిలి మున్సిపాలిటీలో ఆస్తిపన్ను గతేడాది కంటే ఈ ఏడాది మెరుగ్గా వసూలు చేసినట్లు చెప్పారు. మున్సిపాలిటీలో ఆస్తిపన్ను రూ.7.44 కోట్లు డిమాండ్ ఉండగా రూ.4.83కోట్లు వసూలు చేసినట్లు చెప్పారు. గతేడాది రూ.4.05 కోట్లు వసూలు అయినట్లు చెప్పారు. కుళాయి పన్ను రూ.53 లక్షలు డిమాండ్ ఉండగా పాత బకాయిలతో కలిపి రూ.65.35లక్షలు వసూలు చేసినట్లు చెప్పారు. కుళాయి పన్ను గతేడాది రూ.30లక్షలు మాత్రమే వసూలైందన్నారు. పన్నులు వసూలు చేసిన సిబ్బందికి, సహకరించిన ప్రజాప్రతి నిధులు, ప్రజలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

హెచ్ఎం అరుణకుమార్‌కు సత్కారం

ప్రజాశక్తి- కొత్తవలస

మండలంలోని కంటకాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.అరుణకుమార్ ఉద్యోగ విరమణ కార్యక్రమం పాఠశాల ఆవరణలో పాఠశాల కమిటీ మంగళవారం ఘనంగా నిర్వహించింది. ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి పాల్గొని మాట్లాడుతూ ఆధ్యాత్మికత ఎక్కువగా గల అరుణకుమార్ విరమణ అనంతరం తనకు ఇష్టమైన ఆధ్యాత్మక మార్గాలను ప్రజలలో విస్తృతంగా తీసుకెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఎన్.గోపమ్మ, నాయకులు మదీనా అప్పలరాము, మిడతాన కాశి, మండల విద్యాశాఖది కారి బండారు శ్రీనివాసరావు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా గొల్లపేట విద్యార్థులు నిర్వహించిన కోలాటం ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది.

విద్యార్థులకు సేవ చేయడంలోనే తృప్తి

బొండపల్లి: విద్యార్థులకు సేవ చేయడంలోనే తృప్తి లభిస్తుందని నిస్వార్థంగా విద్యార్థులకు సేవలు అందించాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదే శ్రీనువాసులునాయుడు అన్నారు. మంగళవారం అంబటివలస ఎంపిపి స్కూల్‌లో ఉపాధ్యాయునిగా పని చేస్తూ పదవి విరమణ చేసిన కొండలరావు సత్కారసభకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ హాజరై వారు చేసిన సేవలను కొనియాడారు. ఏ రంగంలో పని చేస్తున్నా వారు చేసిన సేవలే వారికి తగిన గుర్తింపునిస్తాయని చెప్పారు. అన్ని వృత్తులు కన్నా ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైనదని ఆ రంగంలో పని చేస్తున్న వారు విద్యార్థులను మంచి పౌరులుగా తీర్చి దిద్దడానికి తమ వంతు కృషి చేయడం ద్వారానే గుర్తింపు పొందుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాకారులు సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎంసిహెచ్ గౌరీశంకరరావు, ఉప సర్పంచ్ పాలూరి రామునాయుడు, ఎంపిటిసి తాళ్ళపూడి అప్పలనాయుడు, నాయకులు రౌతు సూరిబాబు, రౌతు శ్రీనువాసరావు, టి.సన్యాసప్పుడు, మాజీ సర్పంచ్ పాలూరి శ్రీను, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొత్తవలస: ఉపాధ్యాయుడుని సత్కరిస్తున్న ఎమ్మెల్యే కోళ్ల

సేవలు ప్రశంసనీయం

ప్రజాశక్తి- బొబ్బిలి

కారుణ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో సమాజానికి అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని బొబ్బిలి రూరల్ సిఐ నారాయణరావు అన్నారు. మంగళవారం సాయంత్రం కారుణ్య ఫౌండషన్, రోటరీ డిస్ట్రిక్ట్ చైర్ జెసి రాజు రూ.50 వేల సొంతనిధులతో సమకూర్చిన 20 సిమెంట్ బెంచీలు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. బొబ్బిలి రూరల్ పోలీస్ స్టేషన్‌కు సమకూర్చిన సిమెంట్ బెంచాలను సిఐ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కారుణ్య ఫౌండేషన్ చైర్మన్ జెసి రాజు గిరిజన ప్రాంత యువతకు క్రీడా సామాగ్రిని సమకూర్చారని, రూరల్ పోలీస్ స్టేషన్ ఆధునీకరణలో భాగంగా సోలార్ దీపాలు, కూర్చునేందుకు సిమెంట్ బెంచీలు సమకూర్చి తన ఉదారతను చాటుకున్నారని అన్నారు. సమాజానికి సేవ చేయాలన్న సామాజిక బాధ్యత, స్పృహ కలిగి ఉండటం అభినందనీయమన్నారు. జెసి రాజు మాట్లాడుతూ కొంతమంది విజ్ఞప్తి మేరకు కూర్చునేందుకు సిమెంట్ బెంచీలు చేయించామని వాటిని బొబ్బిలి రురల్ పోలీస్ స్టేషన్, సీతానగరం బస్ స్టాప్, పిరిడి బస్ స్టాప్, అర్‌బిపురం పోలీస్ స్టేషన్, జిటివలసలో పంపిణీ చేశామన్నారు. ఇంతకుముందు రోటరీ ఆధ్వర్యంలో 60 బెంచీలు పంపిణీ చేశామని ఆ సూర్తి తోనే కారుణ్య సంస్థ 50 రూపాయలు వెచ్చించి బెంచీలను పంపిణీ చేసిందని అన్నారు. కార్యక్రమంలో చందు, నూక రాజు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వేడుకగా శేషమ్మ శత జయంతి

ప్రజాశక్తి-విజయనగరం

స్థానిక దయాళ్ నగర్ కాలనీలో ఆచంట శేషకుమారి శత జయంతి వేడుకను ఘనంగా నిర్వహించారు. మంగళవారం జరిగిన కార్యక్రమంలో రాదాస్వామీ సత్సంగం, విజయనగరం బ్రాంచ్ సభ్యులు పాల్గొని ఆచంట శేషమ్మకు నూరవ జన్మదిన శుభాకాంక్షలను తెలిపారు. బ్రాంచ్ కార్యదర్శి ఎం.ఆనందకుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నూరు వసంతాలు పూర్తి చేసుకొని ఆరోగ్యంగా ఉన్న శేషమ్మ జీవిత విశేషాలు వివరించారు. అనంతరం శేషమ్మతో కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. సత్సంగ సీనియర్ సభ్యులు మెహతా ప్రసాద్ మాట్లాడుతూ విజయనగరం సత్సంగ బ్రాంచ్ కి వంద సంవత్సరాల చరిత్ర ఉందని, ఇంతవరకు వందేళ్లు జీవించిన ఏకైక సత్సంగీ ఆచంట శేషమ్మ అని చెప్పారు. కార్యక్రమంలో సత్సంగ సభ్యులు కె.వసంతకుమార్, రామ్ ప్రసాద్, టీ.ఆనంద్, కె.నాగభూషణం,ఆకెళ్ళ సత్యనారాయణ, పి.మురళీమోహన్, డి.ప్రభాకర్, సుబ్రహ్మణ్యం, ఆచంట యోగేశ్వరి, ఎమ్.సత్యవతి, రాజేశ్వరి, త్రివర్ణ, దుర్గారానీ, భవాని పలువురు సత్సంగులు పాల్గొన్నారు.



ఎస్‌కోట: పింఛన్లను అందిజేస్తున్న ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి

పింఛన్ల పంపిణీ

జిల్లా వ్యాప్తంగా మంగళవారం పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఎస్‌కోట మండలం కొత్తూరు, వెంకటరమణ పేటలో ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, బాడంగి, బొబ్బిలి మండలాలల్లో బుడా చైర్మన్ తెంటు లక్ష్మునాయుడు పింఛన్లను పంపిణీ చేశారు.

బాడంగి: వృద్ధునికి పింఛను అందిస్తున్న తెంటు రాజా

పబ్లిక్ నోటీస్

మహారాజశ్రీ ఫ్యామిలీ జడ్జి విజయనగరం వారి కోర్టు

FCMC 14/2019 CRMP 593/2023

To,
మూలమండల త్రినాధ్ S/o గురువులు, ఆర్ఎంపి మెడికల్ ప్రాక్టీషినర్, మేదరవీధి, నియర్ గొల్లవీధి, బొబ్బిలి, విజయనగరం జిల్లా.

మీ భార్య మూలమండల సౌమ్యశ్రీ మనోవర్తి బాకీ రాబట్టుటకై పిటిషన్ దాఖలు చేసియున్నారు. పైన తెల్పిన కోర్టులో **15-04-2025**న వాయిదా ఉన్నది. ఆ రోజు **ఉదయం 10 గంటల**కు పైన తెలిపిన కోర్టులో మీరు వ్యక్తిగతంగా గాని, న్యాయవాదితో గాని హాజరు కాగలరు. లేనిచో మీ పరోక్షములో కేసు విచారణ జరుప బడునని తెలియపరచుచున్నాము.

S.S.S.S.V.R.M.Raju
Advocate,
Vizianagaram,
Cell : 944083691